# శపించబడిన అంజూరపు చెట్టు

"ప్రొద్దున వారు మార్గమున పోవుచుండగా ఆ అంజూరపుచెట్టు వేళ్లు మొదలుకొని యెండి యుండుట చూచిరి". మార్కు 11:20; మత్తయి మరియు మార్కు ఇద్దరు మాత్రమే యేసు అంజూరపు చెట్టును శపించుటను గూర్చి వ్రాశారు.

## 1. ఆకలి గొనిన యేసు

"ఉదయమందు పట్టణమునకు మరల వెళ్లుచుండగా ఆయన ఆకలిగొనెను". మత్తయి 21:18; యేసు ఉదయం బేతనియ నుండి భోజనం చేయకుండా యేరుషలేము దారిలో వచ్చుచుండగా ఆయన ఆకలిగొనెను.యేసు మానవ దేహంలో ఉన్నాడు గనుక ఆకలి గొనినాడు అని మనం భావించవచ్చు గాని ప్రభువుయొక్క ఆకలి వేరు. ఎలా ఆయన ఆకలి తీరగలదు? ఆయనే జీవాహారమై యున్నాడు. ఆయనే ప్రపంచ పోషకుడు. "అందుకు యేసు వారితో ఇట్లనెను జీవాహారము నేనే, నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు". యోహాను 6:35; యేసును ఆహారంగా స్వీకరించి ఆత్మలో రక్షించబడి ఆత్మీయంగా మనం ఫలించిన స్థితిలో ఉండుటయే ఆయన ఆకలి తీరే మార్గం. మనం ఆయనను విశ్వసించి నీతిమంతులుగా మారుటయే ఆయన ఆకలి తీర్చు మార్గం. నీతి కొరకు ఆకలి దప్పులు గలిగిన వారు ధన్యులు.

## 2. ఆకులతో ప్రబలియున్న అంజూరపు చెట్టు

సాధారణంగా అంజూరపు చెట్టుకు ఆకులతోబాటు కాయలు కూడా రావడం, లేక కొన్ని సార్లు ఆకులు పూర్తిగా రాకమునుపే కాయలు ఉండడం కద్దు. అంజూరపు చెట్లకు ఆకులు, కాయలు ఉండే సమయం అప్పటికి ఇంకా రాకపోయినా ఒక చెట్టుకు నిండుగా ఆకులున్నాయంటే కాయలు కూడా ఉండి తీరాలి. "ఆకులుగల ఒక అంజూరపు చెట్టును దూరము నుండి చూచి, దానిమీద ఏమైనను దొరకునేమో అని వచ్చెను". మార్కు 11:13; కాని ఆకులతో ప్రబలిన అంజూరపు చెట్టు, దూరము నుండి ఫలములు ఉన్నట్లుగా కనబడుచూ, దగ్గరినుండి చూస్తే ఫలములు లేకుండా వేషధారణ జీవితం కలిగి ఉంది. ఈ చెట్టు దారి ప్రక్కనే ఉండి ఆకులతో ప్రబలి, కాయలు ఉన్నట్లుగా దారినబోయే అనేకులను ఆకర్షిస్తూ ఉన్నది. కాని తీరా చెట్టు దగ్గరకు వెళ్తే అందరికి నిరాశ. కనుక ఇది ప్రజలను ప్రభువును మోసం చేయుచున్నది. ఈనాడు అనేకుల జీవితాలు ఇదే విధంగా వేషధారణ బ్రతుకులతో క్రీస్తును, ఆయన సంఘమును మోసం చేసే విధంగా జీవితాలు ఉన్నవి. "నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చనగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయనుద్దేశించుచున్నాను". ప్రకటన 3: 16;

## 3. ఫలములు లేని అంజూరపు చెట్టు

ఫలించాల్సిన సమయంలో ఫలములు లేకుండా ఎంతో ఉందని చెప్పుకుంటూ, ఏమి లేకుండా ఉండే ఏ వ్యక్తికైనా సంఘానికైనా కూడా అంజూరపు చెట్టు సూచనగా ఉంది. కాయలు లేకుండా గుబురుగా ఆకులుంటే లాభం ఏముంది? ఇది ఒక గొడ్డుబోతు చెట్టుగా ఉన్నది అనగా ఆకులు రాల్చలేని, తన కాలమందు ఫలించని, దేవుని ఆజ్ఞను పాటించని చెట్టుగా ఉన్నది. అది పండ్ల కాలం కాదని మార్కు వ్రాస్తున్నాడు. అనగా ఇంకా పచ్చి కాయలు పండ్లుగా మారనికాలం. అనగా పిందెలు పచ్చికాయలు ఉండే సమయం. ఈ చెట్టుకు కనీసం పచ్చికాయలు పిందెలు కూడా లేవు. బైబిల్లో చెట్లు జాతులనూ వ్యక్తులనూ సూచిస్తాయి "అతడు నీటికాలువల యోరను నాటబడినదైఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనుండును అతడు చేయునదంతయు సఫలమగును". కీర్తన 1:3; "నేనైతే దేవుని మందిరములో పచ్చని ఒలీవ చెట్టువలె నున్నాను". కీర్తన 52:8 ; "నీతిమంతులు ఖర్జూరవృక్షము వలె మొవ్వు వేయుదురు లెబానోను మీది దేవదారు వృక్షమువలె వారు ఎదుగుదురు". కీర్తన 92:12; ఆయన ఆకలి తీర్చుటకు మనం ఫలించవలసిన ఏడు రకాలైన ఫలములు.

### a. ఆత్మ ఫలము

ఆత్మ ఫలము గురించి పౌలు భక్తుడు మాట్లాడుచున్నాడు, "అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము"

గలతీ 5:22.

### b. నీతిఫలము

ప్రభువు రాకడ కొరకు నీతి ఫలములు ఫలించ వలెను. "విత్తువానికి విత్తనమును తినుటకు ఆహారమును దయచేయు దేవుడు మీకు విత్తనము దయచేసి విస్తరింపచేసి, మీరు ప్రతి విషయములో పూర్ణౌదార్య భాగ్యముగలవారగునట్లు, మీ నీతిఫలములు వృద్ధి పొందించును". 2 కొరి 9:10

### c. సేవాఫలము

సువార్త సేవలో అనేక ఆత్మలను ఆత్మీయంగా కనవలెను. "విశ్వాసులైన యజమానులుగల దాసులు తమ యజమానులు సహోదరులని వారిని తృణీకరింపక, తమ సేవాఫలము పొందువారు విశ్వాసులును ప్రియులునై యున్నారని మరి యెక్కువగా వారికిసేవచేయవలెను". 1 తిమోతి 6:2

### d. శిక్షా ఫలము (క్రమ శిక్షణ)

క్రమమైన ఆత్మీయ జీవితం కావలెను, " శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు". 1 తిమోతి 6:2 ; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు?

### e. చందా ఫలము

హృదయ పూర్వక కానుకల ద్వారా దేవుని పరిచర్యకు తోడ్పడవలెను. "ఏలయనగా యెరూషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైన వారి నిమిత్తము మాసిదోనియ వారును అకయవారును కొంత సొమ్ము చందా వేయ నిష్టపడిరి ఈ పనిని ముగించి యీ ఫలమును వారికప్పగించి"... రోమా 15:26,28

### f. వెలుగు ఫలము

అనేకులను పాపమనే చీకటిలోనుండి, సత్యమనే వెలుగులోనికి నడిపించవలెను. "వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది". ఎఫెస్సీ 5:9

### g. నోటి ఫలము (జిహ్వాఫలము)

స్తుతులు, పాటలు, సాక్ష్యాలు, మొదలగు నోటి ఫలం ఫలించాలి. "ఒకడు తన నోటి ఫలము చేత తృప్తిగా మేలుపొందును ఎవని క్రియల ఫలము వానికి వచ్చును". సామెతలు 12:14.

అందుకే అంజూరపు చెట్ల వంటి మన జీవితాలలో ఆయన ఆకలి తీర్చ గల ఫలములు ఉన్నవా లేవా అని కనీసం పిందెలు పచ్చికాయలు అన్నా ఉన్నవా అని ఆయన పరిశీలించుటకు వస్తున్నాడు.

## 4. శపించబడిన అంజూరపు చెట్టు

ప్రభువు యొక్క పరిశీలనలో పై ఫలములు లేక గొడ్డుబోతుగా ఓడిపోయిన అంజూరపు చెట్టు శపించబడినది.

"అందుకాయన ఇకమీదట ఎన్నటి కిని నీ పండ్లు ఎవరును తినకుందురు గాక అని చెప్పెను". మార్కు 11:14 ; ప్రియ దేవుని బిడ్డలారా! ప్రభువు చేసే కార్యాలు అన్ని ఎంతో కనికరంతో కూడినవై వుంటాయి కాని ఇక్కడ కఠినమైన కార్యం ప్రభువు చేసినట్లుగా మనం చూస్తున్నాం. కారణం సృష్టి యావత్తును దేవుడు మానవుని కొరకు చేసాడు. మానవుడు దేవుని కొరకు చేయబడ్డాడు. తాను ఎంతో ప్రేమించిన మానవునికి సంతోషాన్ని అందించడంలో ఈ చెట్టు విఫలమైనది గనుక శపించబడినది. "అంజూరపుచెట్లు వాడి పోయెను...నరులకు సంతోషమేమియు లేకపోయెను". యోవేలు 1:12;

రేపు మనవలన దేవునికి సంతోషం లేకపోయినా మన పరిస్థితి వాడిపోవడమే. యేసుప్రభువును అభిషిక్తుడుగా, ప్రభువుగా, రక్షకుడుగా స్వీకరించనివారి గతిని ఇది వెల్లడిస్తున్నది.

## 5. శాపవచనాన్ని విన్న శిష్యులు

ఫలించని అంజూరపు చెట్టు గురించి ప్రభువు పలికిన శాప వచనాలు శిష్యులు విన్నారు. “ఇది ఆయన శిష్యులు వినిరి”. మార్కు 11:14 ; శిష్యులకు ఇది ఒక పాఠముగా కనబడు చున్నది. కారణం యేసు యొక్క సమయం ముగింపుకు వచ్చింది మరియు శిష్యుల సమయం ఆరంభం కాబోవు చున్నది. వాస్తవానికి శిష్యులకు పాఠం నేర్పుటకే ప్రభువు అంజూరపు చెట్టుకు శాపాన్ని ఇచ్చాడు. ప్రభువు తలచుకొంటే, ఆ అంజూరపు చెట్టుతో "నీవు వెంటనే ఫలించుదువు గాక" అని అంటే ఆ చెట్టు వెంటనే ఫలించదా ప్రభువు ఆకలి తీరదా? ఎండిపోయిన జీవితాలను కూడా ఫలింపజేయు దేవుడు యేసు. కేవలం తన బిడ్డలైన వారికి పాఠం నేర్పుటకే ప్రభువు ఈ చెట్టును మనస్సులో శపించకుండా, ఆ శాపవచనాలను శిష్యులతోబాటు మనందరం వినునట్లు బిగ్గరగా పలికాడు. విన్న శిష్యులు ప్రొద్దున్నే ఆ దారిని వెళ్తూ ఆ అంజూర చెట్టు వేరులతో సహా ఎండిపోయి ఉండడం చూశారు. ఇదే విషయాన్ని పేతురు యేసుతో చెప్పాడు. అప్పుడు వారికి యేసు “దేవుని మీద నమ్మకం ఉంచాలి" అని చెప్పాడు. నమ్మిన వారు జీవితంలో అద్భుతంగా ఫలించగలరు. యేసు ద్వారా ఈ పాఠం నేరుచుకున్న శిష్యులు ప్రభువుని నమ్మి భవిష్యత్తులో అద్భుతమైన అపోస్తులులుగా ఫలించారు.

## 6. అంజూరపు చెట్టుపై దేవుని తీర్పు

ఇక్కడ ఈ అంజూరపు చెట్టు ఇశ్రాయేలుకు సూచనగా ఉందని కూడా మనం చెప్పవచ్చు. ఇశ్రాయేలుకు కూడా పుష్కలంగా ఆకులున్నాయి గానీ కాయలు లేవు. “కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని మీతో చెప్పుచున్నాను” మత్తయి 21:43; తన రాజ్యాన్ని తన కుమారుణ్ణి నిరాకరించిన యూదా జాతి దగ్గర్నుంచి తీసివేసి ఇతరులకిచ్చాడు. ఇతరులంటే క్రీస్తును స్వీకరించే ఇతర జాతులవారమైన మనమే. కొద్ది కాలంలోనే సంఘాల్లో ఇతర జాతులవారే అధిక సంఖ్యాకులయ్యారు. “అప్పుడు ద్రాక్షతోటమాలితో ఇదిగో , ఈ అంజూర చెట్టుపండ్లు వెదకడానికి మూడేళ్ళ నుంచి వస్తున్నాను గాని ఒక్కటి కూడా కనబడలేదు. ఈ చెట్టువల్ల ఈ భూమికి దుర్వినియోగం ఎందుకు? దీనిని నరికివెయ్యి! అన్నాడు”. లూకా 13:6-9;

ద్రాక్షతోటలో పని చేసే వ్యక్తిగా యేసు అంజూరపు చెట్టు గురించి తండ్రిని బ్రతిమాలడం ద్వారా కనీసం మరి కొంత కాలం దానిపైకి రానున్న తీర్పును ఆలస్యం అయ్యేలా చేశాడు. ఆ సమయంలో అంజూరు చెట్టుగనుక కాయలు కాయడం మొదలు పెడితే ఆ తీర్పును శాశ్వతంగా మళ్ళించిన వాడవుతాడు. “ఆయన దానిని బాగుగా త్రవ్వి రాళ్లను ఏరి అందులో శ్రేష్ఠమైన ద్రాక్షతీగెలను నాటించెను దాని మధ్యను బురుజు ఒకటి వేయించి ద్రాక్ష తొట్టిని తొలిపించెను. ద్రాక్షపండ్లు ఫలింపవలెనని యెదురు చూచుచుండెను గాని అది కారుద్రాక్షలు కాచెను,ఆలోచించుడి, నేను నా ద్రాక్షతోటకు చేయబోవు కార్యమును మీకు తెలియ జెప్పెదను నేను అది మేసివేయబడునట్లు దాని కంచెను కొట్టి వేసెదను. అది త్రొక్కబడునట్లు దాని గోడను పడగొట్టి దాని పాడుచేసెదను”. యెషయా 5:2,5; “ఇప్పుడే గొడ్డలి చెట్లవేరున ఉంచబడి యున్నది గనుక మంచి ఫలము ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడునని చెప్పెను”. లూకా 3:9 ; “అది చక్కని ఫలముగల పచ్చని ఒలీవ చెట్టని యెహోవా నీకు పేరు పెట్టెను,

గొప్ప తుపాను ధ్వనితో దానిమీద మంటపెట్టగా దాని కొమ్మలు విరిగిపోవుచున్నవి ఇశ్రాయేలు వంశస్థులును యూదా వంశస్థులును బయలునకు ధూపార్పణముచేసి నాకు కోపము పుట్టించుటచేత తమంతట తామే చేసిన చెడుతనమును బట్టి మిమ్మును నాటిన సైన్యముల కధిపతియగు యెహోవా మీకు కీడుచేయ నిర్ణయించుకొని యున్నాడు" యిర్మీయా 11:16,17.

## 7. అంజూరపు చెట్టును గురించిన నీతి

అంజూరపుచెట్టు వృత్తాంతం ద్వారా యేసుప్రభువు ఖచ్చితంగా స్పష్టం చేసిన విషయం యేదనగా క్రీస్తు రాజ్యం ఫలింపని వారి నుండి తీసివేయబడి, ఫలించే అన్యులకు ఇవ్వబడుతుంది. అంజూరపు చెట్టును గురించి మాట్లాడ్డంలో ప్రభువు యొక్క ఉద్దేశ్యం మనుషులు చేస్తున్న భయంకరమైన కార్యాలను, చెయ్యకుండా వదిలి పెడుతున్న పరిశుద్ధమైన కార్యాలను దేవుడు ఎప్పటికప్పుడుగమనిస్తున్నాడు. ఇందులో సందేహం లేదు. కొందరిని లోకంనుండి తొలగిస్తూ మరి కొందరి విషయంలో మరికొద్ది కాలం ఓపికతో ఎదురు చూస్తున్నాడు. మంచి ఫలాలు లేని ఏ జీవితమైనా ప్రమాదంలో ఉన్నట్టే. దేవుని కోసం ఫలించని మనుషులు అనవసరంగా ఆయనకు చెందిన భూమిపై కొంత భాగాన్ని ఆక్రమించి ఉంటున్నారు. వారు అలాగే చాలా కాలం ఉండేందుకు ఆయన అనుమతించడు. ఆచెట్టు ఎప్పుడైనా ఏక్షణమైనా ఎండిపోవచ్చు. ప్రభువు నందు ఫలింపు లేని జీవితం ఏ క్షణంలోనైనా ఆగిపోవచ్చు.

ప్రియ దేవుని బిడ్డలారా! ఒక్కసారి మన జీవితాలను పరిశీలించుకుందాం. ఆయన రెండవ సారి త్వరగా రానైయున్నాడు యేసు ఆకలి తీర్చగల ఫలించిన జీవితం మనలో ఉందా లేదా? పాప జీవితమే మనలను ఎండి పోయేలా చేస్తుంది. పాపపు జీవితంలో జీవిస్తూ అనేకులు ఈనాడు దేవుని అశ్రద్ధ చేస్తూ సమయం వ్యర్థం చేస్తూ తీర్పుకు లోనగుచున్నారు.

నూట ఇరవై సంవత్సరాలు సమయం ఇచ్చినగాని నోవాహు కాలం ప్రజలు ఫలించలేక తీర్పుకు గురయ్యారు. ఏ పాపమూ మనలో లేకుండా జాగ్రత్తపడాలి. ఆత్మీయ జీవితాలలో మనం ఎండిపోకూడదు, వాడిపోకూడదు. ఆయన మనలను ఫలింపజేయుట కొరకు మనకు రావాల్సిన శిక్షను తన మీద వేసికొని సిలువలో శ్రమ అనుభవించి మనకు పాదుచేసి నీరు కట్టుచున్నాడు. ప్రభువు త్వరగా రాబోవు చున్నాడు. చిగిరించి, ఫలించుటకు సిద్ధ పడుదాం. యేసు ఆకలి తీర్చగల ఫలములు ఫలించుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనలను ఆయుత్త పరచును గాక! ఆమెన్!!